ప్రజాశక్తి
మంగళవారం 31 డిసెంబర్ 2024 పేజీలు 8







విజయనగరం, పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అంబేద్కర్ విగ్రహాల వద్ద వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/పార్వతీపురం

పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, అమిత్ షాను వెనకేసుకొస్తున్న ప్రధానమంత్రి మోడీ తన వైఖరిని మార్చుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల సోమవారం నిరసనలు తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారపు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ మాట్లాడుతూ ఈ దేశ ప్రజలకు దిశా, నిర్దేశమైన రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను మతోన్మాద శక్తులు కావాలనే అవమానించడం సిగ్గు చేటన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యా నికి గడ్డుకాలం వచ్చిందని వ్యాఖ్యానించారు. లౌకికశక్తులు, ప్రజాస్వామ్య వాదులు అన్నా (మిగతా..3లో

అందరి సహకారంతో జాతర

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - మక్కువ

యాత్రికలు, అధికారులు, ప్రజలందరి సహకారంతో సంబర పోలమాంబ జాతర వైభవంగా జరుపుకుందామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం సాయంత్రం సంబర నడిమి వీధిలో జిల్లా కలెక్టర్ శ్యాంపసాద్ అధ్యక్షతన దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన జాతర సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతం మాదిరిగా కాకుండా పోలమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కాళ్లకు మట్టి అంటకుండా దర్శనానికి వెళ్లేలా ఉండాలన్నదే తన సంకల్పమన్నారు. అందుకోసం రహదారి నిర్మాణానికి ఒక్క గ్రామానికే రూ. 2.50 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే అభివృద్ధి పనులు 50శాతం పైబడ్డాయన్నారు. పనులు ఆలస్యం కావడానికి గ్రామస్తులే ఒకంత కారణమని ఆమె అసహనం వ్యక్తం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని జాతర సందర్భంగా రోడ్లపై చెత్తా చెదారాలు ఉండకుండా చూడాలని సూచించారు.

500 మంది పోలీసులు.. 66 బస్సులు

పోలమాంబ జాతర సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి మాధవరెడ్డి తెలిపారు. నిరంతర డ్రోన్ పర్యవేక్షణతో పాటు సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ మొబైల్ వెహికల్స్‌తో పాటు సివిల్ యూనిఫాంలో తన సిబ్బంది రౌండ్ ది క్లాక్ వలె భద్రతపై పర్యవేక్షణ చేస్తారని (మిగతా..3లో)

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లాలో చేపట్టిన దేహ దారుఢ్య పరీక్షల ప్రక్రియ సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. ఈ పరీక్షలకు 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 321 మంది అభ్యర్థులు మాత్రమే హాజరైనట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. వేకువజామున 4 గంటల (మిగతా..3లో)



ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

స్టాంప్ డ్యూటీ రూ.4.73 కోట్లు విడుదల

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఎట్టకేలకు స్టాంప్ డ్యూటీ నిధులను విడుదల చేశారు. 2022 ఏడాదికి సంబంధించి ఏడు నెలలకు మూడు మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జిల్లా పరిషత్‌కు, వివిధ పంచాయతీలకు మొత్తం రూ.4.73కోట్లను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి కృషితోనే ఈ నిధులు విడుదలైనట్లు కొంత మంది పంచాయతీ సర్పంచులు చెబుతున్నారు.

వివిధ పంచాయతీల్లో భూముల అమ్మకాలు ద్వారా 5శాతం స్టాంప్ డ్యూటీని స్థానిక సంస్థలకు కేటాయిస్తారు. ఇందులో భాగంగా 2022 నుంచి భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు ఈ నిధులు జమకాలేదు. కాని జిల్లాలోని మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ద్వారా నిధులను 2023 వరకు విడుదల చేశారు. దీంతో ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి ఇటీవలి ఈ నిధులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అంబేద్కర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రాలను అందజేశారు. దీంతో ఈ నిధులను ప్రస్తుతం విడుదల చేశారు. ఫలితంగా ఆమెకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఏడు నెలల కాలానికి..

2022 ఏడాదికి సంబంధించిన ఏడు నెలల కాలానికి రూ.4.73 కోట్లను విడుదల చేశారు. ఇందులో జిల్లా పరిషత్‌కు రూ.90లక్షలు, మూడు మండలాల మండల పరిషత్‌లకు రూ.90లక్షలు, ఆయా పంచాయతీల్లో జరిగిన రిజిస్ట్రేషన్ల ప్రకారం పంచాయతీలకు మిగతా రూ.2.93 కోట్లు జమకానున్నాయి. ఈ నిధులు పంచాయతీల్లో కొంత అభివృద్ధి పనులకు ఉపయోగపడతాయని సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ఎంపిపి

గోదాంలో రేషన్ బియ్యం పక్కదారి

●బైరిపురం గిడ్డంగి సంస్థలో అక్రమాలు ●పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మెరక ముడిదాం

అక్రమాలకు అడ్డాగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదామును అందులో పని చేస్తున్న సిబ్బంది మార్చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెరక ముడిదాం మండలం బైరిపురం గ్రామంలో ఉన్న ఎపి రాష్ట్ర గిడ్డంగుల సంస్థలో రేషన్ బియ్యం అక్రమాలకు గత కొన్ని సంవత్సరాలుగా అడ్డాగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ గిడ్డంగుల సంస్థకు పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు ప్రతినెలా సుమారు 10వేల క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని పంపించి ఇక్కడ నిల్వ చేస్తుంటారు. ఇక్కడ నుంచి ఎం ఎల్ ఎస్ పాయింట్లకు, రేషన్ దుకాణాలకు పౌర సరఫరా శాఖ అధికారులు సరఫరా చేస్తారు. ఇదే క్రమంలో ఈ గోదాంలో నిలువ చేసిన బియ్యం బస్తాలకు గోదాంలో పనిచేస్తున్న కొంత మంది కన్నాలు పెట్టి ఒక్కొక్క బస్తా నుండి సుమారు మూడు లేదా నాలుగు కేజీలు పైనే తీసి వాటిని వేరే రేషన్ సంచులకు ఎత్తి, వేల కిలోల బియ్యాన్ని వ్యాపారులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించు కోకపోవడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈవిషయమై గిడ్డంగి మేనేజర్ కె. అప్పారావును వివరణ కోరగా, ఎటువంటి అక్రమాలూ జరగటం లేదని అన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లజాబితాను సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఓటు నమోదుకు అందిన దరఖాస్తుల మేరకు తయారు చేసిన ఓటర్ల తుది జాబితాను నోటీస్ బోర్డులో తహశీల్దార్ బి సుదర్శన్ రావు ఆధ్వర్యంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాధ రావు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిటి రవిశంకర్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన క్రీడాకారులు

కొత్తవలస: విశాఖపట్నంలోని వేపగుంటలో గంటల కనకారావు కరాటే అకాడమీలో నిర్వహించిన బెల్ట్ టెస్ట్‌లో కొత్తవలస క్రీడాకారులు సత్తాచాటారు. ఒకినావా స్పోర్ట్స్ అకాడమీ నుంచి 10 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కె.గౌతమ్ రితిక్, పి.జెస్సికా, ఎ.సాయిసుజన్, ఎల్.అవినాష్ ఎల్లో బెల్ట్, పి.నాగ వెంకటవంశీ, పి.గౌరీ ప్రసన్న గ్రీన్ బెల్ట్, ఎం.దేవహర్ష గ్రీన్‌బ్లూ బెల్ట్, శ్రీలక్ష్మి ప్రసన్న , ఇ.దేవికి లత, ఎం.గోవర్ధన్ మెరూన్ బెల్ట్ సాధించారు. వీరిని కోచ్ కె.సూర్యనారాయణ అభినందించారు.

స్వయం ఉపాధికే అర్బన్ మార్కెట్

బొబ్బిలి: మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకే మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సోమవారం అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించి, విక్రయించారు. అర్బన్ మార్కెట్‌ను కమిషనర్ సందర్శించారు. అన్ని రకాల ఆహార ఉత్పత్తులను తయారు చేసి ఆర్థికంగా బలపడాలని కోరారు. కార్యక్రమంలో టిపిఆర్‌ఒ జగన్మోహన్, సిఎంఎం లలిత, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

పుణ్యగిరి గెడ్డ ఆక్రమణలపై చర్యలు

శృంగవరపుకోట: పట్టణంలో పుణ్యగిరి గెడ్డ ఆక్రమణలపై సోమవారం అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మండల సర్వేయర్ జి.రామ ఆధ్వర్యాన రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి, హద్దులను నిర్ధారించారు. గెడ్డకు ఇరువైపులా సర్వే చేసి, హద్దులను నిర్ధారించి, ఆక్రమణలను తొలగిస్తామని మండల సర్వేయర్ తెలిపారు.

కల్వర్టు నిర్మించాలని వినతి

వేపాడ : మండలంలోని బానాది, బల్లంకి గ్రామాల మధ్య కాలువ పైనున్న కల్వర్టు శిథిలావస్థకు చేరిందని, వెంటనే కొత్తది నిర్మించాలని సామాజిక కార్యకర్త రెక్కి అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ఎంపిడిఒ సి హెచ్.సూర్యనారాయణను కలిసి అర్జీ అందజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో 32 దరఖాస్తులు

వేపాడ : మండలంలోని కెజిపూడిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 32 దరఖాస్తులు అందాయి. కెజిపూడి నుంచి 22, ఎస్.కోట సీతారాంపురం నుంచి 10 దరఖాస్తులు వచ్చాయి. తౌలుత గ్రామంలో తహశీల్దార్ రాములమ్మ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.

అనధికార లేఅవుట్‌కు 'ఉపాధి' రోడ్డు

శృంగవరపుకోట : అనధికార లేఅవుట్‌కు ఉపాధి హామీ నిధులతో రోడ్డు మంజూరు చేయించుకున్నారని వార్డు సభ్యులు డాక్టర్ చిప్పాడ శేషగిరి ఆరోపించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ఎ.వి హోమ్స్ అనే అనధికార లేఅవుట్‌కి రోడ్డు వేసేందుకు ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించుకున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి, ఆ పనులు నిలిపివేయాలని కోరారు.

దళారులను నమ్మొద్దు : డిఎస్‌పి

బొబ్బిలి: కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు కోరారు. సోమవారం స్థానిక వీరబొబ్బిలి క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులతో మాట్లాడారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి ఆచూకీ ఇవ్వాలన్నారు. నేర చరిత్ర కలిగిన వారికి ఉద్యోగాలొస్తే క్యారెక్టర్ సర్టిఫికెట్ ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ

గజపతినగరం, రామభద్రపురం : హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణానికి రక్షణ ఉంటుందని బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గజపతినగరం సర్కిల్ కార్యాలయం నుంచి సాయి సిద్ధార్థ కళాశాల వరకు పోలీసులు హెల్మెట్ వినియోగంపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిఐ జి.ఎ.వి రమణ, ఎస్ఐలు కె.లక్ష్మణరావు, మహేష్, కె.సీతారాం, జయంతి పాల్గొన్నారు. రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌ను డిఎస్‌పి శ్రీనివాసరావు వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.

అతివేగం ప్రమాదకరం

కొత్తవలస: రోడ్డుపై అతివేగం ప్రమాదకరమని, తాగి డ్రైవింగ్ చేయకూడదని సిఐ షణ్ముఖరావు అన్నారు. కంటకాపల్లి వద్దనున్న శారద పరిశ్రమ యాజమాన్యం 10 రోడ్డు సేఫ్టీ బోర్డులను, రేడియం స్టిక్కర్లను పోలీసులకు అందజేసింది. కార్యక్రమంలో శారద పరిశ్రమ హెచ్ఆర్ డిజిఎం సన్యాసిరావు, స్పోర్ట్స్ ఎజిఎం మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు దిగడం తగదు

ప్రజాశక్తి-వీరఘట్టం

నాలుగో రోజుకు చేరిన సమ్మె



సమ్మె శిబిరంలో పాల్గొన్న కార్మికులు, సిఐటియు నాయకులు

మండలంలోని కర్లాం గ్రామ సమీపంలో ఉన్న వెంకటరామా పౌల్ట్రీ యాజమాన్యం కవ్వింపు చర్యలకు దిగడం తగదని సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ హెచ్చరించారు. నాల్గో రోజు సోమవారం కూడా పౌల్ట్రీ కార్మికులు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె చేస్తున్న తీరును చూసి యాజమాన్యం కొత్తగా విధుల్లోకి ముగ్గురు వ్యక్తులను తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు సమ్మెలో ఉండగా కొత్తగా ఎటువంటి నియామకాలు చేయకూడదనే చట్టం గురించి యాజమాన్యం తెలుసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి కవ్వింపు చర్యలకు గాని, రెచ్చగొట్టే ధోరణి గానీ చేస్తే పౌల్ట్రీలో జరిగే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి వస్తోందని హెచ్చరించారు. సిఐ శంకరరావు హుటాహుటిన పౌల్ట్రీకి వెళ్లి యాజమాన్యంతో చర్చించి కొత్తగా విధుల్లోకి తీసుకున్న ముగ్గురిని విధుల నుంచి బయటకు పంపించారు. కార్మికులు నిరవధిక సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, ఇప్పిలి గురు నాయుడు, ఈశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

వసతిగృహంలో అపరిశుభ్రత

సంక్షేమాధికారిపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వసతిగృహంలో పరిశుభ్రతలోపించిన సంగతి మీకు తెలియడం లేదా అంటూ వార్డెన్ శరణ్యను, సిబ్బందిపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కళాశాల, పాఠశాల బాలుర సంక్షేమ వసతిగృహాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వసతిగృహాల వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. వసతి గృహాల నిర్వహణ అధ్వానంగా ఉన్నాయంటూ అసహనం వ్యక్తం చేశారు. వసతిగృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా అని వసతిగృహం సంక్షేమ అధికారిని ప్రశ్నించారు. హాస్టల్ నిర్వహణ తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరుగుదొడ్ల వ్యర్థజలాలు డైరెక్టుగా చెరువుకు కనెక్షన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. అనంతరం ఉన్నత పాఠశాలలో జరిగే వైజ్ఞానిక సదస్సును పరిశీలించారు. విద్యార్థులతో చేసిన ప్రాజెక్టులు వాటి ఉపయోగం అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాఠశాల హెచ్ఎం బి. శంకర్రావు, జనసేన మండల కోఆర్డినేటర్ గుడివాడ జమరాజు, ఎంఇఒ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పల్లెపండగ పనులు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం

పల్లెపండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన మెటీరియల్ కాంపొనెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ ఇంజినీర్లతో సోమవారం కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంజూరైన పనుల్లో ఇప్పటివరకు 442 పూర్తయ్యాయని, జనవరి 14 నాటికి అన్ని పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. లేయర్ పనులను రోజుకు వంద చొప్పున పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ చెప్పారు. కొత్తగా మంజూరు చేస్తున్న 292 స్పౌజ్ పింఛన్లను, వీలైతే ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేయాలని సూచించారు. ఎస్‌సి కులగణనపై జాబితాలను ఇప్పటికే ప్రచురించామని, వాటిపై అభ్యంతరాలను స్వీకరించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిఆర్‌డిఎ పిడీ ఎ.కళ్యాణచక్రవర్తి, డ్వామా పిడీ ఎస్.శారదాదేవి పాల్గొన్నారు



నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-గజపతినగరం

నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని, మంచి ఉద్యోగాలు సంపాదించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. స్థానిక సాయిసిద్ధార్థ విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ వివిధ కంపెనీల ద్వారా సుమారు వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చిన అవకాశాలను వదులుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, బెజవాడ రాజేశ్వరి, టిడిపి నాయకులు కోట్ల సుగుణాకరరావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి పావని, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మర్రాపు సురేష్, సాయి సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత చంద్రశేఖర్, హెచ్ఆర్ మేనేజర్ మజ్జి త్రినాథపాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

డెంకాడ: బలమైన సంకల్పంతోనే మాదక ద్రవ్యాల నుంచి విముక్తి లభిస్తుందని స్థానిక ఎస్ఐ ఎ సన్యాసినాయుడు అన్నారు. మండలంలో జొన్నాడ, మోదవలస, అక్కివరం పాఠశాలలు, చింతలవలస ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ హెచ్‌సి రామారావు, కానిస్టేబుల్ శ్రీను, పాల్గొన్నారు.

చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళిని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, రాజా కళాశాల రోడ్డు, గొల్లవీధి ప్రాంతాల్లో సోమవారం పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉండటాన్ని గమనించారు. చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆమె సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.


కలెక్టర్‌కు వినతి అందిస్తున్న ఎండిఎం కార్మికులు

తొలగించిన ఎండిఎం కార్మికులు విధుల్లోకి..

శృంగవరపుకోట : తొలగించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. సోమవారం స్థానిక ఎంఇఒ నర్సింగరావును రమణ ఆధ్వర్యాన ఎండిఎం కార్మికులు కలిశారు. గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతిపై కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందించి, డిఇఒకు ఆదేశాలు జారీ చేశారని, దీంతో ఎంఇఒ నర్సింగరావుకు డిఇఒ ఫోన్ ద్వారా చెప్పారని వివరించారు. ఈ మేరకు తొలగించిన కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని ఎంఇఒ సూచించారు. కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు బొడ్డు బంగారమ్మ, అనకాపల్లి భవాని, జి.లక్ష్మి, జి.గౌరీశ్వరి, సిహెచ్ కోట లక్ష్మి, దేవుడమ్మ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 137 వినతులు

ప్రతి వినతికీ సంతృప్తికర పరిష్కారం : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క వినతికి అర్జీదారు సంతృప్తి చెందే రీతిలో సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అర్జీదారుల నుంచి సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకున్న తర్వాత సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ జిల్లా అధికారులతో వినతుల పరిష్కారంపై సమీక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 30 వినతులు సరిగా పరిష్కరించని కారణంగా రీఓపెన్ చేశారని, వాటిని ఆయా అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జె.సి. సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 137 వినతులు అందాయి. విశాఖలో ఇటీవల జరిగిన విభిన్న ప్రతిభావంతుల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో తతీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టును కలెక్టర్ అభినందించారు. టోర్నమెంటులో ఉత్తమ బ్యాట్స్‌మెన్ గా ఎంపికైన కె.లిఖిత్, బౌలర్ గా ఎంపికైన ఆర్.హరికృష్ణలను కలెక్టర్ అభినందించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇన్ ఛార్జి ఎడి. పి.బాలాజీ కూడా వున్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణ అక్షయపాత్రకు ఇవ్వొద్దు

ఇంటర్ విద్యార్థులకి మధ్యాహ్నం భోజనం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ వంట నిర్వహణ అక్షయపాత్రకి ఇవ్వాలని నిర్ణయాన్ని విరమించుకోవాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతినిచ్చారు. గత 20ఏళ్లగా డ్వాక్రా మహిళలు మధ్యాహ్నం భోజన నిర్వాహణ చేస్తున్నారని, గతంలో కూడా ఇంటర్ పిల్లలకు హైస్కూల్ వంటవారే వండి పెట్టేవారని తెలిపారు. కానీ ఇపుడు అక్షయ పాత్రకి ఇవ్వడాన్ని యూనియన్‌గా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి

జిల్లాలో చెరుకు రైతులకు ధర తరుగు పేరుతో తూకంలో తగ్గింపు, రవాణా లోడింగ్, ఛార్జీలు పేరుతో టన్నుకు రావాల్సిన డబ్బులలో తగ్గింపును అరికట్టాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు,చెరుకు రైతుల సంఘం అధ్యక్షులు గిన్ని కృష్ణారెడ్డి గ్రీవెన్సులో వినతి అందజేశారు. ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులు చెరుకును ప్రభుత్వం ప్యారీ సుగర్ ఫ్యాక్టరీకి పంపిస్తోందని, సదరు ఫ్యాక్టరీ రైతులకు టన్ను చెరుకు వద్ద30 కేజీలు రద్దు, కట్లు పేరుతో తగ్గించి ధర చెల్లిస్తున్నారన్నారు. రవాణా, లోడింగ్ తదితర ఛార్జీలు కూడా రైతుపై వేస్తున్నారని, ప్రకటించిన రూ.3100 ధరలో కూడా రవాణా టన్నుకు రూ,2806, రీ, లోడింగ్ చార్జి 180 రూ, లారీ మమ్మూలు రూ.25 వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ అక్రమాలను అరికట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ఆరా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇస్తున్న వినతులు ఏవిధంగా పరిష్కారమవుతున్నదీ తెలుసుకునేందుకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేరుగా వారికి ఫోన్ చేసి మాట్లాడారు. సంబంధిత ప్రభుత్వ శాఖ సమస్యను పరిష్కారం చేసిన తీరుపై సంతృప్తిగా వున్నారా లేదా అనే అంశాన్ని తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడగా వారంతా తమ వినతులు పరిష్కారం పట్ల సంతృప్తితో ఉన్నట్లు చెప్పారు.

బాధితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- విజయనగరంకోట

బాధితుల సమస్యలను పరిశీలించి తక్షణం పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ ఎస్.శంకరరావు, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్ఐఆర్‌కె చౌదరి, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలి

ప్రజాశక్తి- విజయనగరం కోట

నూతన సంవత్సర వేడుకలను నగరంలో ప్రశాంతయుతంగా నిర్వహించుకోవాలని వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేడుకల పేరుతో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదని స్పష్టంచేశారు. అర్ధ రాత్రి ఒంటి గంట తరువాత రహదారులపై తిరగరాదని సూచించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు నష్టపరిహారం త్వరితగతిన అందజేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ తెలిపారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మోనిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపరిహారం అందించడంలో ఆలస్యం జరగకూడదని, ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రెండు జిల్లాల రెవెన్యూ అధికారులు రెండు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

నుండే ప్రారంభమైన ఈ ప్రక్రియను ఎస్‌పి పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్స్ ను పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధ్రువ పత్రాలను పరిశీలించి బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్ మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ విస్తీర్ణం కొలతలు నిర్వహించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పిఇటి. పరీక్షలను అనుమతించారు. అభ్యర్థులకు ముందుగా 1600 మీటర్ల పరుగును నిర్వహించి, నిర్దిష్ట సమయంలో పరుగును పూర్తి చేసిన అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ నిర్వహించారు. పిఇటి. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి మెమోరాండం జారీ చేస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. నియామక ప్రక్రియలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు యానివర్స్, ఎం.వీరకుమార్, ఎస్.బాపూజీ, టి.ఎస్.శ్రీనివాసరావు, కె.థామస్ రెడ్డి, ఎ. పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో జాతర

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఆర్‌టిసి అధికారులు ఎప్పటి మాదిరిగానే మన్యం జిల్లాలోని డిపోలతో పాటు విజయనగరం డిపో నుండి కూడా 66 బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఐదు నిమిషాలకు ఆయా డిపోల నుండి బస్సులు బయలుదేరేలా చూస్తామని తెలిపారు.

జాతరలో ఎక్కడా ప్లాస్టిక్ కనిపించకూడదు

జనవరి 27, 28, 29 తేదీల్లో జరిగే జాతరలో ఎక్కడా ప్లాస్టిక్ కనిపించకూడదని కలెక్టర్ శ్యాంపసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ ట్యాప్‌ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. దాతలకు మజ్జిగ ఇతర ప్రసాదాలు సరఫరా చేస్తామంటే అవకాశం ఇవ్వాలన్నారు. వైద్య సేవ కేంద్రాలు అందుబాటులో ఉండాలన్నారు. రహదారుల మధ్య ఆటంకం కలగకుండా ఉండేలా వెంటనే విద్యుత్ స్తంభాలు తొలగించాలని దానికి సంబంధించిన షిఫ్టింగ్ చార్జీలను దేవాదాయ శాఖ విడుదల చేయాలని ఈవో సూర్యనారాయణకు కలెక్టర్ ఆదేశించారు. బహిరంగ మల విసర్జన జరగకూడదని బస్సులు నిలిచి ఉండే ప్రదేశంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఎఎస్‌పి అంకిత సురాన, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే బేబినాయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. అటవీ ప్రాంతంలో తాను చిత్రీకరించిన వైల్డ్‌లైఫ్ చిత్రపటాన్ని, కేలెండర్‌ను ఆయనకు అందించారు. నియోజకవర్గ సమస్యలను వివరించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. బేబినాయనతో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, నాయకులు నర్సుపల్లి వెంకటేష్, బి.కృష్ణమూర్తి ఉన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



గజపతినగరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి మంత్రులకు, తన అనుబంధ మతోన్మాద సంస్థలకు గౌరవం లేదన్నారు. అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని, అమిత్‌షాను వెనకేసుకొస్తున్న ప్రధానమంత్రి మోడీ తన వైఖరిని మార్చుకోవాలని లేనియెడల మరిన్ని ప్రజా పోరాటాలు చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డిశంకర్రావు, నాయకులు కె.సురేష్, రమణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, నాయకులు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బెలగాంలో గల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బొత్స నర్సింగరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కన్వీనర్ పి.సంగం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఎఐటియుసి నాయకులు జీవ, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి తదితరులు మాట్లాడారు. దేశానికి మనువాద మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దేశంలో దళిత, గిరిజన, మహిళలపై దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోడీ అమిత్ షాను వెనుకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ తరహా ధోరణులు పెత్తందారీ పోకడలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజ్యాంగబద్ధంగా లభించిన కేంద్ర హోంశాఖ మంత్రి పదవి నుంచి అమిత్‌షా తప్పుకోవాలని, ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు, గొర్లి వెంకటరమణ, వి.ఇందిర, సిపిఐ నాయకులు సూరయ్య, సిఐటియు నాయకులు డి.రమణారావు, కొల్లి సాంబమూర్తి, పాకల సన్యాసిరావు, బివి రమణ, బి.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన కొమరాడలోని దళితపేటలో నిరసన చేపట్టారు.


భోగాపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సాలూరు రూరల్ : అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యాన బట్టివలసలో నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో వంతల సుబ్బారావు, చిన్న, రాజు, అప్పన్న, రమేష్ పాల్గొన్నారు.

బొబ్బిలి : అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు బి.అప్పలస్వామి ఆధ్వర్యాన స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిరసన, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎస్.గోపాలం, ఎం.శ్రీనివాస్, వై.అప్పారావు, పుణ్యవతి, పిల్ల లక్ష్మణరావు, జి.రమేష్ పాల్గొన్నారు.

కొత్తవలస : అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కొత్తవలసలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వంక ఆదినారాయణ, టివి రమణ, బంద గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి ఆధ్వర్యాన స్థానిక కాంప్లెక్స్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, నాయకులు ఆర్.హరికృష్ణవేణి, లింగాల వెంకటరావు, సూర్యనారాయణ, గోవింద, రాములమ్మ, వీరమ్మ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని


బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

మండలంలోని కొండలింగాలవలసలో సిపిఎం మండల నాయకులు తామరాపల్లి సోములు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో చిలక సన్యాసి, గంగరాజు, సూరిబాబు, కూర్మారావు, సుందరరావు, నాగరాజు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం, సిపిఐ, నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు సోమవారం జరజాపుపేట దళిత కాలనీలో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కనకల రాము,ఎం.సత్య నారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కాళ్ల అప్పల సూరి, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మ నాభం తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించాలని సిపిఎం నాయకులు బి సూర్యనారాయణ ఆధ్వర్యాన భోగాపురంలో ముక్కాం కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, రాము, వాసు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, స్థానిక మూడు రోడ్లు కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

179శాతం పెరిగిన గంజాయి కేసులు

- మహిళలపై నేరాలు తగ్గుముఖం
- పెరిగిన సైబర్ క్రైం, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- వార్షిక నివేదికలో ఎస్‌పి మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మన్యంజిల్లా ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విస్తరించిన ఆన్లైన్ ఆర్థిక వ్యవహారాల వల్ల సైబరు నేరాలు దేశవ్యాప్తంగా పెరిగాయని, ఆ క్రమంలోనే జిల్లాలో కూడా ఈ నేరాలు గణనీయ స్థాయిలో పెరుగుదల కనిపించినప్పటికీ జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలతో పాటు ఇతర నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. అలాగే గంజాయి కేసులు 179శాతం పెరిగిందన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసుల సమావేశ భవనంలో జిల్లా పోలీసు అధికారులతో ఈ ఏడాదికి సంబంధించి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం 2024లో జిల్లాలోని క్రైమ్‌పై వార్షిక నివేదిక విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి

గతేడాది కంటే ఈ ఏడాది హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్, హర్ట్ కేసులు 4 శాతం తగ్గి 168 కేసులు నమోదయ్యాయాయి. దొంగతనాలకు సంబంధించి గతేడాది 126 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 13 శాతం తగ్గి 109 కేసులు నమోదయ్యాయి. రూ.98,83,910 విలువైన ఆస్తులు చోరీకి గురికాగా, పోలీస్ శాఖ చేపట్టిన దర్యాప్తు ఫలితంగా వీటిలో 58 శాతం రికవరీతో 23 శాతం పురోగతి వచ్చిందన్నారు. గతేడాది 11 రేప్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది పదికేసులు నమోదయ్యాయి. మహిళల గౌరవానికి భంగం కల్గించే కేసులు 2023లో 58 నమోదుకాగా, ఈ ఏడాది 17 శాతం తగ్గి, 48 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. పోక్సో కేసులు 2023లో 18 నమోదు కాగా, 2024లో వాటి సంఖ్య 11 శాతం తగ్గి, 16 కేసులు మాత్రమే నమోదయ్యాయి. గతేడాది మహిళలకు సంబంధించిన నేరాలు 189 నమోదు కాగా, 2024లో 13 శాతం తగ్గి 165 కేసులు నమోదయ్యాయన్నారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి కేసులు గతేడాది 36 నమోదు కాగా, ఈ ఏడాది 33కేసులు (8శాతం) నమోదయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన 2023లో రహదారి ప్రమాదాల్లో 275 కేసులు నమోదై, 95 మంది మృతిచెందగా, ఈ ఏడాది 11 శాతం కేసుల సంఖ్య తగ్గి 245 కేసులు నమోదై, 69 మంది మృతితి చెందారన్నారు.

అనూహ్యంగా పెరిగిన గంజాయి కేసులు

గంజాయి అక్రమ రవాణాదారులపై గతేడాది 14 కేసులు నమోదు కాగా 28 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 205 .640 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకొని, 5 వాహనాలును సీజ్ చేశామని ఎస్‌పి తెలిపారు. అయితే ఈ ఏడాది 179 శాతం పెరిగి 39 కేసులు నమోదు చేసి, 78 మందిని అరెస్ట్ చేసి, వారి నుండి 736.344 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, 10 వాహనాలు ను సీజ్ చేశామని తెలిపారు. స్కూల్స్, కాలేజీ నందు విద్యార్థులకు, గ్రామాల్లో ప్రజలకు మత్తుపదార్ధాల వలన కలిగే అనర్ధాల గురించి సంకల్పం అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామన్నారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కర్యకలాపాల అడ్డుకట్టకు, గంజాయి సాగు అరికట్టుటకు, రంగంలోకి డ్రోన్లు ఉపయోగిస్తున్నామన్నారు.

పెరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

2023లో డ్రంక్, డ్రైవ్ కేసులు 3,165 నమోదు కాగా, ఈ ఏడాది 3,448 నమోదయ్యాయి. గతేడాది మైనర్ డ్రైవింగ్‌పై 23 కేసులు నమోదు చేయగా, ఈ ఏడాది 178 కేసులు నమోదయ్యాయి. మోటారు వెహికల్ నిబంధనలు అతిక్రమించిన వారిపై 2023లో 78,678 ఇ చలానాలు విధించగా, ఈ ఏడాది 36,054 ఇ -చలానాలు విధించామన్నారు. సైబర్ నేరాల సంఖ్య గతేడాది 36 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 42 కేసులు నమోదయ్యాయి.

పెరిగిన మద్యం అక్రమ రవాణా కేసులు

అక్రమ మద్యం రవాణాపై గతేడాది 684 కేసులు నమోదు కాగా, 2024లో 1043 కేసులు నమోదై 1030 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి 3399.99 లీటర్ల మద్యం, 17,603.5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది కేసు నమోదులో 52 శాతం, అరెస్టుల్లో 30 శాతం పెరగ్గా, అక్రమరవాణాలో మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంలో 279 శాతం, నాటు సారా స్వాధీనం చేయడంలో 08 శాతం పురోగతి సాధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమ చర్యలు

జిల్లా పోలీసు సిబ్బంది ఆరోగ్యం మెరుగుదలపై ప్రత్యేక దష్టిసారించి జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలను నిర్వహించామన్నారు. మెడికల్ క్యాంపులో అన్ని రకాల ఆరోగ్య తనిఖీలను సిబ్బంది కి ఉచితంగా నిర్వహించామన్నారు.

22శాతం తగ్గిన నేరాలు

- స్వల్పంగా పెరిగిన హత్య, అత్యాచార ఘటనలు
- మాదక ద్రవ్యాల నిషేధానికి విద్యార్థుల్లో చైతన్యం
- ఎస్‌పి వకుల్ జిందాల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్

మహిళలపై అఘాయిత్యాలు

కేసులు	2023	2024
వరకట్నం హత్యలు	03	01
ఆత్మహత్యకు ప్రేరేపించే కేసులు	09	03
వరకట్న వేధింపులు	273	235
మానభంగం	02	02
కిడ్నాప్ కేసులు	20	02

ప్రజాశక్తి-విజయనగరంకోట

2023తో పోలిస్తే 2024 సంవత్సరంలో జిల్లాలో నేరాల సంఖ్య 22శాతం తగ్గిందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ సాధించిన ప్రగతి, చేధించిన కేసులు వివరాలను వెల్లడించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులను, యువతను చైతన్య పర్చేందుకు కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమర్ధవంతమైన పోలీసింగుతో జిల్లాలో అన్ని రకాల నేరాలు 22 శాతం తగ్గాయన్నారు. పోక్సో, కొన్ని తీవ్రమైన నేరాల్లో నిందితులు శిక్షింపబడేలా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి. సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆంవిఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి సిఐ ఎన్.శంకరరావు పాల్గొన్నారు.

నమోదైన నేరాలు : బాడిల్లీ నేరాలైన కిడ్నాపింగ్, రైటింగు, గ్రీవియస్ హర్ట్, కొట్లాట కేసులు గత ఏడాది కంటే తగ్గగా, హత్య, హత్యాయత్నం కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. హత్య కేసులు 2023లో 16 నమోదు కాగా, 2024లో 17 కేసులు నమోదయ్యాయి. కొట్లాల కేసులు 2023లో 430 నమోదుకాగా, 2024లో 351 కేసులు నమోదయ్యాయి. గ్రీవియస్ హర్ట్ కేసులు 2023లో 55 నమోదు కాగా, 2024లో 27 కేసులు, కిడ్నాప్ కేసులు గత ఏడాది 22 నమోదుకాగా, 2024లో 6 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 2024లో 22శాతం నేరాలు గత ఏడాది కంటే తగ్గాయి.

పోక్సో కేసులు : 2023లో పోక్సో కేసులు 58 నమోదుకాగా, 2024లో వాటి సంఖ్య 54 కేసులు నమోదయ్యాయి. 12 కేసుల్లో నిందితులకు 20 ఏళ్ల కంటే ఎక్కువగా జైలు శిక్షలు పడగా, పదేళ్ల కంటే ఎక్కువగా 3 కేసుల్లోను, 5ఏళ్ల కంటే ఎక్కువగా 3 కేసుల్లో శిక్ష పడింది.

ఆస్తికి సంబంధించిన నేరాలు : లాభాపేక్ష హత్యలు 2023లో 5 నమోదుకాగా, 2024లో 2 కేసులు నమోదై, -60 శాతం నేరాలు తగ్గాయి. బందిపోటు దొంగతనాలు 2023లో ఒకటి నమోదుకాగా, 2024లో కేసులు ఏమీ నమోదు కాలేదు. రోబరీ కేసులు గత ఏడాది 3 నమోదుకాగా, ఈఏడాది 3 కేసులు నమోదయ్యాయి. పగటిపూట దొంగతనాలు 2023లో 21 కేసులు 2024లో 31కేసులు నమోదయ్యాయి. రాత్రి దొంగ తనాలు 2023లో 107, 2024లో 107 కేసులు నమోదయ్యాయి.

రహదారి ప్రమాదాలు : రహదారి ప్రమాదాల్లో మతుల కేసులు 2023లో 204 నమోదుకాగా, 2024లో 17శాతం తగ్గుదలతో 169 కేసులు మాత్రమే నమోదయ్యాయి. రహదారి ప్రమాదాల్లో 2023లో 464 నమోదు కాగా, 2024లో 437 కేసులు మాత్రమే నమోదయ్యాయి.

అట్రాసిటీ కేసులు : 2023లో ఎస్సీ ఎస్టీ వ్యక్తులపై 73 కేసులు నమోదుకాగా, 2024లో 14శాతం తగ్గుదలతో 63 కేసులు నమోదయ్యాయి.

వైట్ కాలర్ నేరాలు : వైట్ కాలర్ నేరాలు గత ఏడాది కంటే తగ్గాయి. 2023లో 223 కేసులు నమోదు కాగా, 2024లో 168 వైట్ కాలర్ నేరాలు పెరిగాయి.

సైబరు నేరాలు: సైబరు నేరాలు సంఖ్య 2023లో 108 కేసులు నమోదు కాగా 2024లో 107 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఈ కేసుల్లో రూ.88,32,301 నగదును ఫ్రీజ్ చేసి, బాధితులకు న్యాయస్థానం అనుమతులతో అందే విధంగా చర్యలు చేపట్టారు.

మిస్సింగు కేసులు : 2023లో వారిలో 307 కేసుల్లో 381 మంది వివిధ కారణాలతో తప్పిపోగా, 2024లో 360 మిస్సింగు కేసులు నమోదయ్యాయి. వీరిలో 307 మందిని ట్రేస్ చేసి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. 86 శాతం మిస్సింగు కేసులను చేధించారు.

గంజాయి కేసులు : గంజాయి అక్రమ రవాణదారులపై 2024లో 81 కేసులు నమోదు చేసి, 247 మందిని అరెస్టు చేసి, 2152.139 కిలోల గంజాయిని, 78 గ్రాముల నల్లమందును, 29 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ. 1,02,30,415 ఉంటుంది.

ప్రజాఫిర్యాదుల పరిష్కారం

2024లో 1907 ఫిర్యాదులను స్వీకరించి, 1667ఫిర్యాదులను పరిష్కరించారు. 240 ఫిర్యాదు పెండింగులో ఉన్నాయి. వీటిలో చాలావరకు భూవివాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి.

సోషల్ ఆడిట్‌పై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అన్ని సచివాలయాలలో షెడ్యూల్డ్ కులాల సోషల్ ఆడిట్ వివరాలను పొందుపరిచామని, వాటిలో అభ్యంతరాలు ఉన్నట్లయితే జనవరి 6వ తేదీ లోపుగా తెలియజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని సచివాలయాలలో షెడ్యూల్డ్ కులాల సోషల్ ఆడిట్ వివరాలను ప్రదర్శన నిమిత్తం ఉంచినట్లు తెలిపారు. సచివాలయాల పరిధిలో ఉన్న షెడ్యూల్డ్ కులాల జాబితాలో ఎవరివైనా వివరాలు లేకపోతో తక్షణమే తెలియజెప్పాలని తెలిపారు. ఒకవేళ ఏవైనా అభ్యంతరాలు, సలహాలను సచివాలయ రెవెన్యూ కార్యదర్శికి తెలియచెప్పవచ్చని చెప్పారు. వివరాలను పరిశీలించిన అనంతరం అవసరమైన వారి పేర్లను ఆయా జాబితాలో నమోదు చేస్తామన్నారు. ఒకవేళ జాబితాలో అనర్హులు ఉంటే ఆ జాబితా నుండి తొలగిస్తామని తెలిపారు. సామాజిక వర్గానికి చెందిన ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భోగారావుకు పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024 తటవర్తి భారతి స్మారక సాహితీ సభ పురస్కారాల ప్రదానోత్సవం విశాఖపట్నం పౌర గ్రంథాలయం లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కథాస్రవంతి ద్వారా నిరంతరాయంగా 1600 కథలు వినిపించినందుకు గాను విజయనగరానికి చెందిన పప్పు భోగారావు తటవర్తి భారతి స్మారక సాహితీ పురస్కారం 2024 అందుకున్నారు. సెంచూరియన్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు, నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాల మోహన్ దాస్, ఆచార్య బేతవోలు రామ బ్రహ్మం, మేడ మస్తాన్ రెడ్డి ఈ పురస్కారాన్ని అందజేశారు.

స్పందించిన ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు

ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ సత్యారావు

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని సిరిపురం పొందరవీధిలో శనివారం ఘోర అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను వెంటనే వచ్చి, పరామర్శించి, తక్షణమే స్వయంగా ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందేట్టు చూస్తామని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుకు, ప్రసార మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకొని, తక్షణమే ఆదుకోవాలని వారిని ఆదేశించిన రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు గ్రామ వాసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి మాజీ అధ్యక్షులు అదపాక సత్యా రావు ధన్యవాదాలు తెలిపారు. మంటలను ఆర్పడంలో, ఆర్థిక సహాయం, నిత్యావసర, వస్త్ర, ఇతర సామాగ్రి అందించడంలో ముందుండి నడిపించిన సర్పంచ్ డోల తిరుపతిరావు, మాజీ సర్పంచ్ ప్రతినిధి మొయ్య నారాయప్పడు, గ్రామపెద్దలకు, యువకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక బాధ్యతతో విధులు నిర్వర్తించా..

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్



ప్రజాశక్తి-విజయనగరం

మనం చేసే పనిలో నిమగ్నమై ఫలితం వచ్చే వరకు బాధ్యతగా పనిచేస్తే ఫలితాలు వాటాంతట అవే వస్తాయని గ్రామీణ నీటిసరఫరా పర్యవేక్షక ఇంజినీర్ బి.ఉమాశంకర్ అన్నారు. ప్రస్తుత సమాజంలో అన్ని వ్యవస్థల్లో మార్పులు వచ్చినట్లే ఇంజినీరింగ్ వ్యవస్థలో కూడా అనేక మార్పులు వచ్చాయని, ఆ మార్పులకు అనుగుణంగా మనం మారుతూ సామాజిక బాధ్యతతో అందరి సహకారంతో అభివృద్ధి పనులు చేయడం వల్ల ఉద్యోగ జీవితంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా విజయవంతంగా పూర్తి చేయగలిగానని తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో తన ఉద్యోగ జీవిత అనుభవాలను పంచుకున్నారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

ప్రజలకు అత్యవసరమైన తాగునీటి సరఫరా శాఖలో పనిచేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలకు మౌలిక వసతులు కల్పించే పంచాయతీరాజ్, ఎడ్యుకేషన్, మున్సిపల్, ఉపాధిహామీశాఖల్లో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. తన 39 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎన్నో తీపిగుర్తులు మధుర సంఘటనలు ఉన్నాయి. మేము ఉద్యోగంలో చేరిన మొదటి రోజుల్లో ఎటువంటి టెక్నాలజీ అందుబాటులో లేనప్పటికీ ఉన్న వనరులు ఉపయోగించుకొని అన్ని రకాల పనులూ పూర్తి చేసి ప్రజలు అవసరాలు తీర్చేందుకు ప్రయత్నం చేశాం. అందువల్ల భవిష్యత్ తరాలు వస్తున్న టెక్నాలజీని ఉపయోగించు కొని పనులు పూర్తి చేసి ప్రజలకు మరింత దగ్గర కావాలి.

కుటుంబ నేపథ్యం

1963 సెప్టెంబర్ 19న శ్రీకాకుళంలో డాక్టర్ బి జనార్ధనరావు, పద్మావతి దంపతులకు మూడో సంతానం. తనకు అక్క, అన్నయ్య, తమ్ముడు ఉన్నారు. నాన్న వైద్య ఆరోగ్యశాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు అమ్మ గృహిణి. తనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉద్యోగజీవితం విజయవంతంగా పూర్తి చేయగలిగానంటే దానికి నా సతీమణే కారణం.

విద్యాభ్యాసం

తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో నా చదువు వేర్వేరు ప్రాంతాల్లో సాగింది. ప్రాథమిక విద్య శ్రీకాకుళం జిల్లా పొలాకి, హైస్కూల్ విద్య చీపురుపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల, ఇంటర్ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఇంజినీరింగ్ విశాఖ లోని గీతం ఇంజినీరింగ్ కాలేజీ, ఎంటెక్ హైదరా బాద్ జెఎన్‌టియు లో సాగింది.

ఉద్యోగ ప్రస్థానం

1986 జనవరి 17న పంచాయతీ రాజ్ శాఖలో అప్పటి విశాఖ జిల్లా మాడుగుల మండలంలో ఎఇగా ఉద్యోగంలో చేరాను. ఆ తరువాత 1986-93 వరకు విజయనగరం ఎఇగా, 1993-95 వరకు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, 1995-98 వరకు గజపతినగరం ఎఇఇ గా, 1998-2002 వరకు విజయనగరం ప్రాజెక్ట్ ఎఇఇ గా విధులు నిర్వహించాను. ఎంటెక్ చేయడానికి రెండేళ్లు పాటు (2002-04) హైదరాబాద్ జెఎన్‌టియుకు ఇన్ సర్వీస్‌లో వెళ్లాను. ఆ తర్వాత 2004-06 వరకు డ్వామాలో డిఇఇ గా ఉద్యోగోన్నతిపై పనిచేశాను. 2006-14 వరకు విజయనగరం ఆర్‌డబ్ల్యుఎస్‌లో ప్రాజెక్ట్ డిఇఇగా, 2014-17 వరకు ఆర్‌డబ్ల్యుఎస్ క్వాలిటి కంట్రోల్ డిఇఇగా పనిచేశాను. అనంతరం కాకినాడ సర్వ శిక్ష అభియాన్ ఇఇగా 2019 వరకు పని చేశాను. అక్కడ నుంచి విశాఖపట్నం విఎంఆర్ డిఎలో ఇఇగా 2019-21 వరకు, 20021-22 వరకు ఏలూరు ఇఇగా పనిచేస్తున్న కాలంలో కొత్తగా జిల్లాలు ఏర్పాటు కావడంతో అనకాపల్లి జిల్లాకు వచ్చి కొద్ది కాలం పని చేశాను. అనంతరం పర్యవేక్షక ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి రావడంతో విజయనగరం ఎస్ఇగా వచ్చి ఇంతవరకు విధులు నిర్వహించాను.

అనుభవాలు.. సంతృప్తినిచ్చే అంశాలు

39ఏళ్లపాటు అనేక హోదాల్లో పనిచేశాను. ఉద్యోగంలో జాయిన్ అయినప్పుడు ఇప్పుడంత టెక్నాలజీ లేదు. అయినప్పటికీ నేర్చుకొని పనిచేశా. 1998లో చీపురుపల్లి లో పని చేసినప్పుడు ఇక్కడ మంచి నీరు లేక పోవడంతో గడిగెడ్డ నుంచి నీరు తెచ్చి చీపురుపల్లి, గెడ్డపువలస, గరివిడికి నీరుచ్చే ప్రాజెక్ట్ పూర్తి చేయడం సంతృప్తి నిచ్చింది. 2006లో చీపురు పల్లి మెగా ప్రాజెక్ట్ ప్రారంభం నుంచి 2014 పూర్తి అయన వరకు ఉండి పూర్తి చేయడం కూడా సంతోషంగా ఉంది. దత్తిరాజేరు, డెంకాడ మండలాల్లో తాగునీటి ప్రాజెక్ట్‌లు పూర్తి చేసి ప్రజలకు మంచినీరు అందించడం మంచి అనుభూతి. గింజేరు, బుడతనాపల్లి, దేవుపల్లి బ్రిడ్జిలు కూడా సంతృప్తి కలిగిన అంశాలు. విశాఖ విఎంఆర్‌డిఎలో పని చేసినప్పుడు ఎన్ఎడి ఫ్లైఓవర్ బ్రిడ్జి అనుకున్న సమయంలో పూర్తి చేయడం కూడా మంచి అనుభూతి నిచ్చింది. ఎన్ఆర్‌జిఎస్ లో పనిచేసినప్పుడు చెక్‌డ్యామ్ లు, మొక్కలు పెంపకం, జాబ్ కార్డులు ఇదో రకమైన అనుభూతి. కైలాస గిరి సుందరికరణ పనులు చేయడం వంటి పన ఉలు ఎన్నో అనుభూతులు, తీపి గుర్తులు మిగిల్చాయి.

అవార్డులు.. ప్రశంసలు

డ్వామాలో డిఇఇ గా పనిచేస్తున్న 2005లో, ఆర్ డబ్ల్యుఎస్ ప్రాజెక్ట్ డిఇఇగా పనిచేస్తున్న కాలంలో 2006లో, ఎస్ఇ గా 2023 జనవరి, అగస్ట్ లోను, 2024 ఆగస్టులోను మంత్రులు, కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులు ప్రశంస పత్రాలు అందుకున్నాను.

సామాజిక కార్యక్రమాలు

చదువుకొనే రోజుల్లో క్రికెట్ ఆడేవాడిని. ఇప్పటికీ టెన్నిస్ ఆడుతాను. గత 11ఏళ్ల నుంచి ఘంటశాల స్మారక కళాపీఠం ద్వారా పాటలు పాడుతున్నాను. థెరిస్సా క్లబ్‌లో 20ఏళ్ల పాటు వైస్ ప్రెసిడెంట్ గా పనిచేయడం ద్వారా చాలా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఉద్యోగ జీవితం ఇంత విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన పై అధికారులకు. సహచర ఉద్యోగలకు, కింద స్థాయి సిబ్బందికి, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు.

లక్ష్య సాధనతోనే సమాజంలో గుర్తింపు

పంచాయతీరాజ్ ఇఇ కెజి జగన్నాధనాయుడు



ప్రజాశక్తి-విజయనగరం

శాఖ పరంగా జరుగుతున్న పనులపై నిర్ధిష్టమైన అవవగాహన కలిగి, తీసుకొన్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఆ పనులు పూర్తి చేసినప్పుడు సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, తన సర్వీసులో ఆ విధంగా లక్ష్యాలను పూర్తి చేశానని పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజినీర్ కొణతాల గోవింద జగన్నాధ నాయుడు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖలో పనిచేయడం ద్వారా ప్రజలకు అవసరమైన గ్రామీణ రోడ్లు, పక్కాభవనాలు, కాలువలు, సిమ్మెంటు రోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి పనులు చేయడం ద్వారా ఉద్యోగజీవితం సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకున్నారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

అప్పటి విశాఖ జిల్లా అనకాపల్లిలో కొణతాల రామునాయడు (బి కాం నాయడు), సోమరాజు దంపతులకు మూడో సంతానంగా జన్మించాను. ఇద్దరు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెల్లు ఉన్నారు. తండ్రి బెల్లం వ్యాపారం చేసేవారు. వర్తక సంఘంలో ఆయన క్రియాశీలంగా వ్యవహరించడం తో ఎఎమ్ఎల్ స్కూల్, కాలేజీ ఏర్పాటులో ఫౌండర్‌గా వ్యవహరించారు. రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేవారు.

విద్యాభాసం

ఒకటి నుంచి మూడవ తరగతి వరకు అనకాపల్లిలోని దాడి బోగిలింగమ మున్సిపల్ స్కూల్, 4 నుంచి పదోతరగతి వరకు ఎ ఎమ్ఎమ్ఎఎఇఎమ్ స్కూల్, ఇంటర్ ఎఎమ్ఎఎల్ కాలేజీ, ఇంజినీరింగ్ వరంగల్ రీజనల్ ఇంజినీరింగ్ కాలేజీలో పూర్తి చేశాను.

ఉద్యోగజీవితం ప్రస్థానం

1986 జనవరి 10న విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం ఎఇఇ గా విధుల్లో చేరాను. కొత్తగా మండలాలు ఏర్పాటుతో మెరకముడిదాం మండల ఇంజినీరింగ్ అధికారిగా 1987-89 వరకు విధులు నిర్వహించాను. 1989-90 వరకు వేపాడ మండలం. 1990-94 వరకు కొత్తవలస మండలం. 1994-95 వరకు విజయనగరం స్టోర్స్ సబ్ డివిజన్, 1995-2002 నెల్లిమర్ల మండలం, 2002-03 వరకు విశాఖ జిల్లా అచ్చుతాపురం మండలంలో పనిచేశాను. 2003లో డిఇగా ఉద్యోగోన్నతి పొంది బాడంగి ఆర్ డబ్ల్యుఎస్ లో ఒక ఏడాది విధులు నిర్వహించాను. 2004-09 వరకు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు డిఇగా, 2009-14 వరకు ఎస్.కోట పిఆర్ ఐ సబ్ డివిజన్, 2014-21 వరకు కొత్తవలస పిఐయు సబ్ డివిజన్ డిఇ గా పనిచేసి ఇఇగా ఉద్యోగోన్నతిపై 2021లో విజయనగరం ఇఇగా వచ్చి ఇంతవరకు విధులు నిర్వహించాను.

సంతృప్తి నిచ్చే అంశాలు

మెరకముడిదాం మండలంలో పనిచేసే సమయంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తెలుగు గ్రామీణ క్రాంతి పథకంలో రైతులకు వ్యవసాయం చేసుకోవడానికి బావులు మంజూరు చేసింది. సుమారు 300 బావులు సకాలంలో పూర్తి చేయడంతో చాలా సంతృప్తి నిచ్చింది. వేపాడ మండలం వల్లంపూడిలో సగంలో ఉండిపోయిన ఒ హెచ్ ఆర్ లు పూర్తి చేసి తాగునీరు అందించడం ఆనందాన్నిచ్చింది. ఫుడ్ ఫర్ వర్క్‌లో పూర్తి చేసిన తొమ్మిది స్కూల్ బిల్డింగ్‌లు ఒకే రోజు అప్పటి మంత్రి పి.శంకరరావు చేతులు మీదుగా ప్రారంభించడం సంతృప్తి నిచ్చింది. నెల్లిమర్లలో పనిచేసినప్పుడు తొమ్మిది మంచినీటి పథకాలు పూర్తి చేయడం, రూరల్ రోడ్లు పూర్తి చేయడం, కొత్తూరులో బిఆర్‌జిఎఫ్‌లో రోడ్లు వేయడం ఉద్యోగజీవితంలో చాలా సంతృప్తినిచ్చాయి.

అవార్డులు..ప్రశంసలు

శాఖా పరంగా తీసుకొన్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసినందుకు 2022 లో ప్రభుత్వం నుంచి ఉత్తమ అధికారిగా ప్రశంస అందుకున్నాను. జిల్లా స్థాయిలో మూడు సార్లు ఆగస్టు 15, రిపబ్లిక్‌డే సందర్భంగా ఉత్తమ అధికారిగా అవార్డులు మంత్రులు, కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నాను. ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన పైఅధికారులకు, సహచర ఉద్యోగులకు, సిబ్బందికి, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు.

సవాళ్లను అధిగమించడంతోనే ఉద్యోగంలో ఆనందం

టెక్నికల్ అధికారి పట్నాల వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ జీవితంలో సవాళ్లను ఎదుర్కోవడం ద్వారానే విధి నిర్వహణలో ఆనందం ఉంటుందని నగర పాలక సంస్థ టెక్నికల్ అధికారి పట్నాల వెంకటేశ్వరరావు అన్నారు. తన 42ఏళ్ల ఉద్యోగ జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా విధి నిర్వహణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ప్రజాశక్తితో తన ఉద్యోగ జీవిత అనుభవాలను పంచుకున్నారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

విజయనగరంలో బస్ బాడీ బిల్డింగ్ పరిశ్రమ నిర్వహించిన తండ్రి నాగ మల్లేశ్వరరావు ప్రోత్సాహంతో పట్టణంలో రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాలలో ఐదో తరగతి వరకు, ఎంఆర్ హైస్కూల్ లో పదో తరగతి చదివాను. ఎంఆర్ కాలేజీలో బైపిసిలో చేరి మధ్యలో మానేసి మాన్సాస్ ఐటిఐలో సివిల్ విభాగంలో సర్టిఫికెట్ కోర్సు చేశాను. 1983లో టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరాను. 1992లో డ్రాఫ్ట్ మెన్ గ్రేడ్ 2గా, 1997లో గ్రేడ్ 1గా పనిచేశాను. అదే ఏడాదిలో టెక్నికల్ అధికారిగా ఉద్యోగోన్నతి వచ్చింది. 42ఏళ్ల పాటు సొంత ఊరిలో విధులు నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నా వంతు కృషి చేశాను. ఉద్యోగంలోకి రాకముందు యువజన సంఘం స్థాపించి తద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహించాను. రాష్ట్రస్థాయి యువజన నాయకత్వ శిక్షణ పొందిన అనుభవంతో రాజకీయ నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకొని ఉద్యోగ సేవలు అందించాను. నేటి తరం ఉద్యోగులు కూడా అదే భావంతో పని చేస్తే ఎటువంటి సవాళ్లను అయినా అధిగమించగలం. మున్సిపల్ పాలక వర్గంలో సీనియర్ కౌన్సిలర్ల అందరూ మంచి సహకారాన్ని అందించారు. వ్యక్తి గత జీవితంలో నన్ను ప్రోత్సహించిన మంచి మిత్రులు, పెద్దలు బొత్స సత్యనారాయణ, తమ్మన్న శెట్టి, యడ్ల రమణమూర్తితో కలిసి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించాను. బాల్య మిత్రులు అనకాపల్లి డిఎఫ్ఒ గంపా లక్ష్మణ, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య, న్యాయవాది ఎం. రవీంద్రనాథ్, తదితరులు నా కష్ట సుఖాల్లో తోడు నీడగా ఉన్నారు. సొంత ఊరిలో ఉద్యోగ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందుతుండటం ఆనందంగా ఉంది. ఉద్యోగ జీవితంలో నా భార్య కృష్ణ కుమారి, బాల్య మిత్రులు, సహచరులు అందించిన సహకారం మరువలేనిది. నా పిల్లలు పిల్లలు లీలా లోహిత, మీనా మాధవి ఉద్యోగ జీవితంలో స్థిరపడటం , మంచి అల్లుళ్ళు, మనవరాళ్లు రావడం నా జీవితంలో ఆనందించే విషయాలు. ఇఇ లక్ష్మణ స్వామి మార్గదర్శనం చేసి మనిషిగా మసులుకోవటం నేర్పించిన విషయాలు ఎప్పటికీ మరువలేనివి. ఉద్యోగ జీవితంలో, వ్యక్తిగత జీవితంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

జిల్లా కేంద్ర గ్రంథాలయం సీనియర్ అసిస్టెంట్ కూర్మాచార్యులు



ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తినిచ్చిందని జిల్లా కేంద్రంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం సీనియర్ అసిస్టెంట్ తిరుమల పెద్దింటి కూర్మాచార్యులు తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తి తో తన ఉద్యోగ జీవిత అనుభవాలను పంచుకున్నారు.

1962 డిసెంబర్ 15న అప్పలాచారి, క్రిష్టప్ప దంపతులకు నాలుగో సంతానంగా జన్మించాను. ముగ్గురు అన్నయ్యలు ఒక అక్క ఒక తమ్ముడు ఉన్నారు. ఇంటర్‌వరకు చదివిన నేను 1985 ఆగస్టు 20న రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. అదే హోదాలో 22 సంవత్సరాలు పని చేసిన తరువాత 2010లో జూనియర్ అసిస్టెంట్ గా ప్రమోషన్ అదే గ్రంథాలయంలో వచ్చింది. 2017లో జూలై నెలలో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. 1989 మే 5న లక్ష్మితో వివాహమైంది. మాకు ఇద్దరు కుమారులు. పలుమార్లు వచ్చిన ఉత్తమ సేవల అవార్డులను సున్నితంగా తిరస్కరించాను. అందరికీ ఆదర్శప్రాయుడిగా ఉంటూ వృత్తే దైవంగా భావించి ఉద్యోగం నిర్వహించాను. విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

క్షేత్ర స్థాయి పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

క్షేత్రస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ములగ, కవిటిభద్ర గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేలు ఏ మేర పూర్తి చేసారని వైద్య సిబ్బందిని ఆరా తీసి సంబంధిత రికార్డులను తనికీ చేశారు. ములగ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్న తీరును ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలించారు. ఈ సంజీవని వైద్య సేవలు ఏ మేరకు నిర్వహిస్తున్నారో అంతర్జాలములో పరిశీలించి తగు సూచనలు చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డులు పరిశీలించి ప్రతి రోజూ ఎంతమందికి వైద్య పరీక్షలు చేపడుతున్నారన్న వివరాలు చూశారు. అనారోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రంలోని మందుల లభ్యత, వాటి కాలపరిమితి పరిశీలించారు. మందుల వినియోగం స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎనిమియా యాక్షన్ కమిటీలో మెంబెర్స్ ఏవిధమైన బాధ్యత వహిస్తున్నారు, కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిటిభద్ర కెజిబివి హాస్టల్‌లో ప్రిన్సిపాల్, వైద్య సిబ్బందితో సమీక్షించి విద్యార్థుల ఆరోగ్య స్థితి, స్క్రీనింగ్ వివరాలు రికార్డులో పరిశీలించారు. హిమోగ్లోబిన్ శాతం కొంత తక్కువగా గుర్తించిన విద్యార్థులతో మాట్లాడి ప్రతిరోజూ ఐరన్ మాత్రలు వెయిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సిక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యాలయ గణాంక అధికారి శంకర్ రావు, ప్రిన్సిపాల్ మణి, ఇఒ సత్తిబాబు, సూపర్‌వైజర్ కృష్ణంరాజు, వైద్య సిబ్బంది లక్ష్మి, సునీత, భారతి, సుమిత్ర, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహన్‌రావు

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ఆలిండియా దళిత రైట్స్ మూవ్‌మెంట్ (ఎఐడిఆర్ఎమ్) జాతీయ మహాసభలు జనవరి 5నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని వీటిని జయప్రదం చేయాలనీ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గుజ్జల జనార్ధన్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దళితులు ఎదుర్కొంటున్న మౌలికమైన సమస్యలను పరిష్కరించాలని, దళితులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగే విధంగా తోడ్పాటు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు బీ.మోహన్, గరుగుబిల్లి సూరయ్య, పువ్వల ప్రసాద్, కె.త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డూరువలసలో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాలలో ప్రజలు తమ భూ సమస్యల పరిష్కరించుకోవచ్చునని తహశీల్దార్ జయలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని రావికోన పంచాయతీ అడ్డూరువలసలో నిర్వహించిన సదస్సులో గ్రామ పరిధిలోని రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించి నట్లుగా ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె రామస్వామి, ఆర్ ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా వెంటనే పరిష్కరించాలని ఎఎస్‌పి డాక్టర్ ఓ.దిలీప్‌కిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యక్తుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎఎస్‌పి, డిసిఆర్‌బి తాతబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతానగరం

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వేడుకుల పేరిట చట్టపరమైన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో రహదారులపై వేడుకలు నిర్వహించ రాదన్నారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత రోడ్లపై ప్రజలు తిరగకూడదన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జల జీవన్ మిషన్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు ఈ ఏడాది ఇంటింటికి కుళాయి పథకం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు. సోమవారం కార్యాలయ ప్రాంగణంలో మండలంలోని కార్యదర్శులు సచివాలయ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం జరుగుతున్న పిఎసిఎస్ ఖాతాదారుల ఇకెవైసి నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, గ్రామాల్లో తాగునీరు వృథా కాకుండా కుళాయిలకు ట్యాపులు బిగించాలని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అంగన్‌వాడి కేంద్రాలలో మరమ్మతులు ఏ మేరకు అవసరమవుతాయన్న విషయంపై పరిశీలన జరిపి తనకు నివేదిక అందించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం స్థానిక ఎఎస్ఐ నరసింహులు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఒక్క విద్యార్థి సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండి మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడి ఆదర్శంగా నిలిచి కుటుంబాన్ని పోషించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ కె.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతులు అందజేత

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరం చేందుకు చర్యలు చేపట్టనున్నామని ఉప తహశీల్దార్ బూరాడ సుందరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతులను అందజేశారు.

నేడు బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక మున్సిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగనుంది. 2024-25 రివైజ్డ్ బడ్జెట్, 2025-26 అంచనాల బడ్జెట్‌ని ఈ సమావేశంలో ఆమోదించనున్నారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కమిషనర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు.

పోరాటంతోనే సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- పార్వతీపురం

రాజీలేని పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉండటం సరైంది కాదన్నారు. గిరిజన మంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతూ కాలం గడుపుతున్నారని అన్నారు. కనీస వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ అమరావతిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి నాయక్ తదితరులను అరెస్టు చేసారని తక్షణమే వారిని విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, మురళి, కామేస్, ఉమా, దీప, షర్మిల, కవిత, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

పూర్ణపాడు లాబేసు వంతెనను నిర్మించాలని ఎపి తూర్పు కాపు సంఘం డైరెక్టర్ శేఖర్ పాత్రుడు కోరారు. ఎన్నో ఏళ్లగా కొమరాడ మండలంలో పెండింగ్‌లో వున్న పూర్ణ పాడు లాబేసు మధ్య వంతెనను నిర్మించాలని కోరుతూ సోమవారం సాలూరులో నిర్వహించిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్‌నకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ వంతెనను నిర్మించాలని, మండలంలో 31 గ్రామ పంచాయతీలలో సిసి రహదారులు, అప్రోచ్ రోడ్డు పనులను మంజూరు చేయాలని, తోడుము నుంచి కొట్టునకు బిటి రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వితంతు పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని కొత్తగా 10 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ పి.త్రివిక్రమ రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నవంబరు నుంచి డిసెంబర్ 15 లోపు పింఛన్లు అందుకుంటూ మృతి చెందిన భర్తల పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మార్గదర్శాలు మేరకు వాళ్ల భార్యలకు మంజూరైనట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తామన్నారు. గడిచిన రెండు, మూడు నెలలు పింఛన్ల సొమ్మును తీసుకొని వారికి కూడా ఈనెల పింఛన్‌లో కలిపి ఇస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదు వచ్చాయని ఆయన తెలిపారు. కృష్ణరాయపురం గ్రామానికి చెందిన ఒకే వ్యక్తి రెండు సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి ఉమామహేశ్వరరావు, పలు గ్రామాల కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 27 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 27 వినతులు వచ్చాయి. పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెనరాయికి చెందిన సుగన్న సిసి రోడ్డు మంజూరు చేయాలని విన్నవించారు. అక్కన్నగూడకు చెందిన పెద్ద బాపన్న గృహ నిర్మాణ బిల్లు చెల్లించాలని, గేదెలగూడకు చెందిన కె రమారావు పాఠశాల మంజూరు చేయాలని, మెట్టుగూడకు చెందిన భాగన్న పవర్ విడర్ మంజూరు చేయాలని, వజ్జయిగూడకు చెందిన బంగారయ్య హౌసింగ్ బిల్లు చెల్లించాలని కోరారు. గ్రీవెన్స్‌లో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, స్పోర్ట్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ సిడిపిఒ రంగలక్ష్మి, ఎంఎం కోటి బాబు, ఎపిడి శ్రీహరి ఏటి డబ్ల్యూఒ మంగ వేణి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎఒ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఎఇ వి వినోద్ కుమార్, ఎపిఎం రాము, ఉపాధి ఎపిఒ సత్యం నాయుడు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంతంలో ప్రబలే మలేరియా, డెంగీ, ఫైలేరియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధులపై గ్రామాల్లో కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు కళాజాతా ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం గుమ్మిడి కాలనీ, నిగరం, జొల్లగూడ, కన్నయ్యగూడ, జెకె పాడు గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో తాడి కొండ వైద్యాధికారి మండంగి బుద్దేశ్వ రావు, ఆరోగ్య కార్యకర్తలు ఎస్‌వి ప్రకాష్, బి.లక్ష్మణ, దీపిక, జ్యోతిలక్ష్మి, ధనలక్ష్మి, సి హెచ్ఒలు స్వాతి, దివ్యభారతి, అనూష పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికలు

ప్రజాశక్తి- సీతంపేట

పీసా ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన 17 గ్రామసభలలో 16 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా అంటికొండ గ్రామంలో ఎన్నికలు జరగనట్లు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. దీంతో సీతంపేటలో 102 గ్రామాల్లో పీసా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

కూనిశెట్టి విగ్రహ ఏర్పాటుకు అనుమతి కావాలి

ప్రజాశక్తి- సాలూరు

స్వాతంత్ర్య సమరయోధుడు, సాలూరు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే సర్దార్ కూనిశెట్టి వెంకటనారాయణ దొర విగ్రహ స్థాపనకు ప్రభుత్వ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి పట్టణ తెలగా సంఘ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కూనిశెట్టి విగ్రహస్థాపన విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందని, అనుమతులు మంజూరు చేస్తామని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. తెలగా సంఘ సభ్యులు బలబోలు రవి, కూనిశెట్టి భీమారావు, జెట్టిదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల్లో ఏజెన్సీ కవులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 28 29 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బాలల సాహిత్యం, యువతకు రచనలపై అనే అంశంపై ప్రసంగించిన ఉమా కవి, దేవానంద్‌లను నిర్వాహకులు జి పూర్ణచంద్ ఘనంగా సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కవులు ప్రసంగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన కొనియాడారు. అనంతరం ఉమా కవి భోగెల ఉమామహేశ్వరరావు రచించిన తెలుగు భాష అక్షర కిరణాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గాయకులు గోరేటి వెంకన్న, భువనచంద్ర, మార్గదర్శి శైలజా కిరణ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, జనసేన ఎమ్మెల్యే మండల బుద్ధ ప్రసాద్, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జీవి పూర్ణ చందు పాల్గొన్నారు.



ప్రపంచ తెలుగు మహా సభల్లో పాల్గొన్న ఏజెన్సీ కవులు

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతీయ పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో ఎల్విన్‌పేట పోలీసులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా నడుచుకోవాలని, తోటి వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి - సాలూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రజల నుంచి అందే అర్జీల్లో ఒక్కటి కూడా పెండింగులో లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పింఛన్లు, ఇంటి స్థలాలు, భూ సమస్యలు, ఉపాధి తదితర అంశాలపై 106 అర్జీలను ఫిర్యాదు దారులు కలెక్టరుకు అందించి సమస్యలు వివరించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యకు స్థానికంగానే పరిష్కారం చూపేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.


ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు కింది స్థాయి సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వారి పనితీరు మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాలూరు లో విద్యుత్, రెవిన్యూ వంటి విభాగాలకు చెందిన అర్జీలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, అన్నిశాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ కు 134 వినతులు

పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 134 వినతులు అందినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గల పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం డిఆర్ఒ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ రిసెప్షన్ సెంటరులో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 134 మంది అర్జీదారుల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, తద్వారా అర్జీదారుడు సంతృప్తిని వ్యక్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఇటీవల కురిసిన వర్షాలు తుఫాను కారణంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి తడిసిపోయిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, మద్దతు ధర రైతాంగానికి ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని శ్యామలగౌరీపురం, పనుకువలస, కర్రివలసలో తడిసిపోయిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రజాసంఘాల నాయకులు, రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ తుఫాను కారణంగా రైతులు పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా రాలేదని, మొలకెత్తిన, రంగు మారిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున అధికారులు నష్టాలను కూడా గుర్తించి పరిహారమందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా ప్రకృతి విలయతాండంతో రైతులు నష్టపోయారన్నారు. కనీసం కప్పుకోవడానికి పరదాలు కూడా లేక వర్షంలో తడిసి ముద్దయిన ధాన్యాన్ని చూపిస్తూ రైతులు కంటనీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనా, అధికారులపైనా ఉందని, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, రైతు ప్రతినిధులు రవి, పడాల ఎరకయ్య, పరమేశు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు సచివాలయ ఉద్యోగి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని కందులపదం సచివాలయం ఎఎన్ఎం యశోదమ్మ ఎంపికయ్యారు. మండలంలోని మామిడిపల్లికి చెందిన సర్లంగి యశోదమ్మ న్యూఢిల్లీలో జరగబోవు జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్రం తరుపున బ్యాడ్మింటన్ టీంకు ప్రాతినిధ్యం వహిస్తుందని కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. యశోదమ్మ ఇంతకముందు అనేక రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిందన్నారు. జనవరి 3 నుంచి 8వరకు న్యూఢిల్లీలో త్యాగరాజా ఇండోర్ స్టేడియంలో జరగబోవు జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటుందని శ్రీరాములు అన్నారు. ఈ సందర్భంగా యశోదమ్మ మాట్లాడుతూ తనకు క్రీడాకోటాలో ఉద్యోగం రావడానికి నా చిన్నతనం నుండి మంచి క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన కోచ్ పొట్నూరు శ్రీరాములుకు కృతజ్ఞతలు తెలిపారు. తనను క్రీడల పట్ల ప్రోత్సహిస్తున్న తన భర్త కసినబోయిన రాంబాబు, ఉద్యోగరీత్యా ప్రోతహిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి, మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి శివకుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యశోదను సర్పంచ్ సువ్వాడ శశికళ, పెద్దలు కాసినబోయిన గంగారావు, డొంక అన్నపూర్ణ, బూస తవుడు, సర్లంగి పోలినాయుడు కుటుంబ సభ్యులు అభినందించారు.



ఎపి ఆయిల్‌ఫెడ్‌ను ప్రైవేట్‌పరం చేయొద్దు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఆయిల్ ఫెడ్‌ను ప్రైవేటుపరం చేయకుండా చూడాలని పామాయిల్ సాగుచేసే రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారానికి పామాయిల్ రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ బాలాజీ ఆయిల్ పామ్ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొల్ల సత్యనారాయణ, శేఖర్ పాత్రుడు మాట్లాడుతూ రైతులకు ఎంతో మేలు చేసే ఎపి ఆయిల్‌ఫెడ్‌ను ప్రైవేటుపరం చేస్తే ఆయిల్‌ఫామ్ సాగుచేసే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, ఎటువంటి ప్రయోజనం లేకుండా ప్రైవేటు వ్యాపారుల చేతికి ఈ ఆయిల్ ఫామ్ వెళ్లినట్లయితే రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఇటువంటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేలా ముఖ్యమంత్రికి తెలియజేసి ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు మేలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపి ఆయిల్ ఫెడ్ ద్వారా ఒక కొత్త ఆయిల్ పామ్ కర్మాగారాన్ని కేంద్ర నిధులతో జిల్లాలో ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ, బాలాజీ ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షులు బోళ్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శేఖర్ పాత్రుడు పాల్గొన్నారు.

అందరం ఛైర్మన్లమే

అభివృద్ధే మా అజెండా

ప్రజాశక్తి - పాలకొండ

మీ అందరితో పాటు కౌన్సిలర్‌గా గెలిచాను... ప్రస్తుతం ఛైర్మన్ కుర్చీలో కూర్చున్నాను. కౌన్సిలర్లు అంతా ఛైర్మన్లుగా భావించి ఆయా వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక నగర పంచాయతీ ఛైర్మన్ పల్లా ప్రతాప్ అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పని చేద్దామన్నారు. ఎటువంటి సమస్యలైనా తమ దృష్టికి, కమిషనర్ దృష్టికి తీసుకొస్తే తప్పనిసరిగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో పాటు నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు పట్టణ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. త్వరలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం జరుగుతుందన్నారు.

మెప్మా వార్తపై చర్చ

ఇటీవల 'ప్రజాశక్తి'లో ప్రచురణమైన మెప్మాలో అక్రమాల వార్తపై కౌన్సిల్‌లో చర్చ జరిగింది. కౌన్సిలర్ కోడెం విజయకుమార్ ఈ విషయాన్ని ప్రస్తావించారని, దీనిపై ఏం చర్యలు తీసుకున్నారని కమిషనర్ సర్వేశ్వరరావును ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ మెప్మా వ్యవహారంపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, గంటా సంతోష్‌కుమార్, కడగల రమణ, భాసూరు కాంతారావు తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పార్వతీపురంటౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని కమిషనర్ జి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కావున పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతో పాటు, కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

5న సాలూరులో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగకల్పనలో భాగంగా జనవరి 5న సాలూరులో మెగా జాబ్ మేళా జరగనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె క్యాంపు కార్యాలయం వద్ద జాబ్ మేళా పోస్టరును అధికారులతో కలిసి సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ జాబ్‌మేళా స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసమూర్తి, ప్రజా ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రామునాయుడును పరామర్శిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

హెచ్‌ఎంను పరామర్శించిన విజయగౌరి

ప్రజాశక్తి - సాలూరు

ఆపస్ రాష్ట్ర నాయకులు, బాగువలస జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జాగాన రామునాయుడును ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి సోమవారం పరామర్శించారు. రామునాయుడు కుమారుడు పృథ్వీరాజ్ సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమె రామునాయుడు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. పృథ్వీరాజ్ మరణం చాలా బాధాకరమని, మాష్టారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతో పాటు సాలూరు మండల యుటిఎఫ్ నాయకులు సంతాపం ప్రకటించారు.

నేడు పింఛన్ల పంపిణీ

పార్వతీపురం : జిల్లాలో పింఛన్లను మంగళవారం పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేయుటకు నిర్ణయం తీసుకుందని, ఆ మేరకు 31వ తేదీనే పంపిణీ జరుగుతుందన్నారు

కాలువల్లో పూడికలు తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 29వ వార్డులో గల రామారాపురం కాలనీలోని కాలువల్లో పూడికతీతలను పారిశుధ్య కార్మికులు సోమవారం తొలించారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన 'నా వార్డులో కాలువలను నేనే శుభ్రపరుస్తా' అన్న ప్రజాశక్తి వార్తకు స్పందించి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.ఫకీరురాజు సోమవారం పారిశుధ్య కార్మికులతో పట్టణంలోని 29వ వార్డులో గల రామాపురం కాలనీలో మురుగు కాలువలను పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తలు, వ్యర్థాలు శుభ్రం చేయడంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గమవ్వడంతో ఆ వార్డులోని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

4,5తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు జనవరి 4,5 తేదీల్లో జరుగుతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్ తెలిపారు. మండలంలోని ఎస్ఎఫ్ఐ మహా సభ నిర్వహించా మన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతామన్నారు.. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా దిలీప్, వాసు, కిశోర్, మణి, కార్తీక్, దీపిక ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి.అఖిల్, సిహెచ్ సింహాచలం, సాయి కుమార్ పాల్గొన్నారు .

నేడు ఫించన్ల పంపిణీకి ఏర్పాట్లు

2,75,379 మందికి రూ.115.63 కోట్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో సామాజిక పింఛన్లు మంగళవారం పంపిణీ చేసేందుకు డిఆర్‌డిఎ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా 2,75,379 మంది పింఛను దార్లకు రూ.115.63 కోట్ల మొత్తాన్ని వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించే ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈనెల నుంచి స్పౌజ్ కేటగిరీ కింద భర్త పింఛను పొందుతూ మృతి చెందితే ఆ మొత్తాన్ని భార్యకు మంజూరు చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో నవంబరు 1 తర్వాత మరణించిన పింఛనుదారుల స్థానంలో వారి భార్యలకు పింఛన్లు మంజూరుచేస్తూ, వారికి ఫించను మొత్తాలు అందజేయనున్నట్టు కలెక్టర్ చెప్పారు. ఈ కేటగిరీలో 292 మందికి డిసెంబరుకు పింఛను మంజూరవుతుందని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసులు సత్వర పరిష్కారం కావాలి : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్.సి, ఎస్‌టి అట్రాసిటీ, అత్యాచారాలపై నమోదైన కేసులు సత్వరమే పరిష్కారం చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిల సంబంధించిన కనీస హక్కులను కాపాడవలసిన బాధ్యత అధికారులందరి పైన ఉందని అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్సు అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్.సి., ఎస్.టి వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అంకిత భావం తో పని చేస్తోందని తెలిపారు. కమిటీ సభ్యులు లేవనేత్తిన పలు సమస్యలపై కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందించారు. ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో ఆక్రమణకు గురైన శ్మశానాలను, భూ సమస్యలను గుర్తించి 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆర్‌డిఒకు సూచించారు. అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించాలని సభ్యులు చిట్టిబాబు, సూర్యనారాయణ కలెక్టర్ ను కోరగా చట్టంపై అవగాహన కలిగించేందుకు ప్రతి నెలా 30న మండల స్థాయి లో సివిల్ రైట్స్ డే ను జరుపుతున్నామని తెలిపారు. కోర్టులో 251 కేసులు పెండింగ్ ఉన్నాయని, వీటిని సత్వరమే డిస్పోజ్ అయ్యేలా చూడాలని పిపిని కోరారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్.సి, ఎస్‌టి లకు సంబంధించి 27 కేసులు నమోదయ్యాయని,15 కేసులు విచారణలో ఉన్నాయని తెలిపారు. 60 రోజుల్లోనే చార్జ్ షీట్ ఫైల్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సమావేశం లో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, సభ్యులు పి.చిట్టిబాబు, బసవ సూర్యనారాయణ, సున్నపు రామస్వామి, చంపి సన్యాసి రావు, మజ్జి గణపతి, ఎస్,సి ఎస్‌టి ల తో పని చేస్తున్న స్వచంద సంస్థల ప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



